క్లుప్తంగా

అప్పన్నను దర్శించుకున్న ప్రముఖులు



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాము

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామిని బుధవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ అనంతరాము, రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్ విభాగం డైరెక్టర్ టి.ఎమ్.టకర్ స్వామిని దర్శించుకుని, ఆలయంలోని కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడామండపంలో ప్రదక్షిణ చేశారు. అంతరాలయంలో వీరి పేరిట అర్చకులు అష్టోత్తర పూజ జరిపి, వేద ఆశీర్వచనం అందించారు. ఆలయ సాంప్రదాయం ప్రకారం స్వామివారి జ్ఞాపిక, ప్రసాదం, శేషవస్త్రాలను దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి అందజేశారు.

నేడు భారీ అన్నసమారాధన

పరవాడ: శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని పెదముషిడివాడ గ్రామంలో వేణుగోపాల యూత్ ఆధ్వర్యంలో గురువారం మధ్యాహ్నం భారీ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు యూత్ ప్రతినిధులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పెదముషిడివాడ పరిసర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని, అన్న ప్రసాదాన్ని స్వీకరించాల్సిందిగా కోరారు.

స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు సమష్టిగా కృషి చేద్దాం



మాట్లాడుతున్న స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పునరుద్ధరణకు యాజమాన్యం, కార్మిక సంఘాలు కలిసి సమష్టిగా కృషి చేద్దామని స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ పిలుపునిచ్చారు. బుధవారం ఉక్కు ప్రధాన సమావేశ మందిరంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. స్టీల్‌ప్లాంట్ ఆర్థిక స్థితిని నిరంతరం మెరుగుపరచడానికి సంబంధించిన సమగ్ర ప్రణాళికలో భాగంగా ఉత్పత్తి పెంపు, వ్యయ నియంత్రణ చర్యలను అమలు చేయాల్సి ఉందని తెలిపారు. ఇందుకు అధికారులు, కార్మికులు అందరూ సహకరించాలన్నారు. సమావేశంలో వివిధ కార్మిక సంఘాల ప్రతినిధులతో పాటు డైరెక్టర్లు ఎ.కె.బాగ్చీ, ఎస్.సి. పాండే, గణేష్, జి.వి.ఎన్.ప్రసాద్‌తో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కణితి హైస్కూల్‌కు స్పోర్ట్స్ ఎక్స్‌లెన్స్ అవార్డు



విద్యార్థులు సాధించిన జ్ఞాపికలతో పాఠశాల హెచ్ఎం, వ్యాయామ ఉపాధ్యాయులు

అగనంపూడి: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా విశాఖ జిల్లా స్థాయిలో స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు కణితి హైస్కూల్ ఎంపికైంది. 180 పాయింట్లతో జిల్లాలో అగ్రగామిగా నిలిచింది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ వివరాలను వెల్లడించింది. మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన స్కూళ్ల హెచ్ఎంలు, పీఈటీలను క్రీడా దినోత్సవం సందర్భంగా సత్కరించనున్నారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) నిర్వహించిన వివిధ క్రీడా పోటీల్లో రాష్ట్ర, జాతీయ స్థాయిలో కణితి హైస్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. శుక్రవారం విశాఖలో నిర్వహించనున్న కార్యక్రమంలో స్పోర్ట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు అందుకోనున్నట్లు హెచ్ఎం ప్రకాశరావు, ఫిజికల్ డైరెక్టర్లు మన్నాజీ, కె.నారాయణరావు తెలిపారు.

పాత నేరస్తుడికి జైలు శిక్ష, జరిమానా

పరవాడ: పగటి పూట ఇంటిలో ఎవరూ లేని సమయంలో పలు దొంగతనాలకు పాల్పడి, పట్టుబడిన నిందితుడు పిళ్లా నూకరాజు నేరం రుజువు కావడంతో 8 నెలల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ అనకాపల్లి జిల్లా 11వ అదనపు మెజిస్ట్రేట్ ఎ.రమేష్ బుధవారం తీర్పు వెలువరించినట్లు పరవాడ సీఐ ఎస్.బాలసూర్యారావు తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. చోడవరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన నూకరాజు పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని మంత్రిపాలెంలో దొంగతనం చేస్తూ పట్టుబడిన కేసులో ఈ ఏడాది ఏప్రిల్ 1న అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణ అనంతరం పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృణాళిని వాదనల్ని ఏకీభవిస్తూ నేరం రుజువైనందున మెజిస్ట్రేట్ రమేష్ పై విధంగా తీర్పు ఇచ్చినట్లు సీఐ తెలిపారు.

ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఉండాలి



వైద్య వృత్తిలో ఉన్నవారిపై దాడులు జరిగితే తక్షణమే స్పందించే టాస్క్‌ఫోర్స్ ఉండాలి. ఎటువంటి దాడులు జరిగినా బాధ్యులకు వెంటనే శిక్షపడేలా పటిష్టమైన చట్టాల్ని రూపొందించాలి. ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. వాష్ రూమ్స్, విశ్రాంతి గదులను ఏర్పాటు చేయాలి. నిరంతరం సీసీ కెమెరాల నిఘా, పర్యవేక్షణ ఉండాలి. సెక్యూరిటీ గార్డులు మూడు షిప్టుల్లో పనిచేసేలా చూడాలి.

– డాక్టర్ ఎస్ఎస్ఆర్ చక్రవర్తి, ప్రధాన వైద్యాధికారి, సబ్బవరం పీహెచ్‌సీ

రవాణా సౌకర్యం కల్పించాలి



రాత్రి వేళల్లో విధులు ముగించుకుని ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లే వైద్యులకు ప్రత్యేక రవాణా సదుపాయం కల్పించాలి. విధుల్లో ఉన్న వైద్యులపై ఎలాంటి దాడులు జరగకుండా, గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలి. సెక్యూరిటీ సిబ్బంది సమర్థులై ఉండాలి. ఆస్పత్రికి ఎవరొస్తున్నారో, ఎవరు వెళ్తున్నారో రికార్డు చేయాలి. మద్యం సేవించి ఆస్పత్రికి వచ్చేవారిని నియంత్రించాలి. వైద్యులపై ఎవరైనా దాడికి పాల్పడితే వారిని కఠినంగా శిక్షించాలి.

– డాక్టర్ మాధవి, అడవివరం ఆరోగ్యకేంద్రం

రైతుల చూపు.. రాగుల వైపు

రాగి సంగటి, అంబలి(మాల్ట్), రాగి అట్లు/సక్కులు ఒకప్పుడు పేదోళ్ల ఆహారం.. ప్రస్తుతం బడా బాబులు, ఆరోగ్యాభిలాషుల ప్రధాన ఆహార పదార్థాల్లో రాగులే కీలకం. పూర్వం పల్లెలకు మాత్రమే పరిమితమైన ఈ ఆహార పదార్థాలు పట్టణ, నగరబాట పట్టాయి. పట్టణ రోడ్లపై పిజ్జా హట్‌ల మాదిరిగా, ఉదయం, సాయంత్రం వాకింగ్ చేసే పార్కులు, క్రీడా మైదానాల వద్ద రాగిమాల్ట్ శిబిరాలు వెలిశాయంటే.. అది చేసే మేలు ఏపాటిదో స్పష్టమవుతోంది. అందుకే పెందుర్తి నియోజకవర్గ పరిధిలో రాగుల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు.

- ఆరోగ్య జాగ్రత్తలతో రాగులకు పెరుగుతున్న గిరాకీ
- మధుమేహం, రక్తపోటు రోగులకు మేలైన ఆహారం
- అవసరాలకు తగ్గట్టుగా పెరుగుతున్న పంట విస్తీర్ణం
- మంచి దిగుబడితో రైతులకు లాభాలు



పెందుర్తి ప్రాంతంలో రాగి పంట, (ఇన్‌సెట్) కోత దశకు చేరిన రాగులు



నోరూరించే కాంబినేషన్ కోడికూర-రాగిసంగటి

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో వ్యవసాయం వర్షాధారమే. ఇక్కడ నీటి ఎద్దడి ఎక్కువ. దీంతో వర్షాభావ పరిస్థితుల్లో కూడా సాగుకు ఢోకాలేని రాగులు/చైతల సాగుపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి వ్యయం శ్రమ కూడా తక్కువ. దీంతో నాలుగేళ్లలో పెందుర్తి నియోజకవర్గ పరిధిలో రాగుల సాగు విస్తీర్ణం ఏటా పెరుగుతూ వస్తోంది. ఈ ఏడాది ప్రస్తుతానికి 460 ఎకరాల విస్తీర్ణంలో రాగులు సాగు చేస్తున్నారు. ఖరీఫ్ సీజన్ కొనసాగుతుండటంతో ఇది మరింత పెరిగే అవకాశం ఉంది.

తక్కువ వ్యయంతోనే సాగు

రాగుల్ని నారు లేదా విత్తనాలు నేరుగా వేసే పద్ధతుల్లో పండించవచ్చు. నారు పద్ధతిలో ఎకరాకు రెండున్నర కిలోలు, నేరుగా విత్తనాలు వేసే పద్ధతిలో నాలుగు కిలోలు అవసరం. నేరుగా వేసే పద్ధతిలో ఎకరాకయ్యే పెట్టుబడి వ్యయంలో దాదాపు రూ.4 వేలు వరకు తగ్గుతుంది. ప్రభుత్వం ద్వారా కిలో విత్తనాలు రూ.80, బహిరంగ మార్కెట్‌లో రూ.100–120 మధ్య దొరుకుతాయి. శ్రీచైతన్య(గోదుమ రంగు రాగులు) రకానికి మంచి గిరాకీ ఉంది. అటూఇటుగా రూ.10 వేల పెట్టుబడితో ఎకరం విస్తీర్ణంలో రాగుల్ని సాగు చేసేయొచ్చు.

నియోజకవర్గంలో రాగుల సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)

మండలం	2021	2022	2023	2024(ప్రస్తుతం)
పెందుర్తి	90	120	130	100
సబ్బవరం	270	250	300	300
పరవాడ	15	40	50	60
మొత్తం	375	410	480	460

శ్రీ సాగు.. దిగుబడి బాగు

సాధారణంగా ఎకరాకు 5–6 క్వింటాళ్ల రాగులు దిగుబడి వస్తుంది. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో శ్రీ(ఎస్ఆర్ఐ–సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్) వరి సాగు పద్ధతినే రాగుల్లోనూ ప్రవేశపెట్టి 12–15 క్వింటాళ్ల దిగుబడి సాధిస్తున్నారు. అదే పద్ధతిలో స్థానిక రైతులు కూడా రాగుల సాగుపై దృష్టిసారిస్తున్నారు. మార్కెట్‌లో కిలో రాగుల ధర రూ.100 వరకు పలుకుతోంది. ఖర్చులు పోనూ రూ.30–40 వేలు వరకు రాబడి వస్తోంది. సూపర్‌మార్కెట్లలో సైతం రాగులు, రాగి పిండికి డిమాండ్ ఉంది. దీంతో వారే నేరుగా రైతుల నుంచి వీటిని కొనుగోలు చేసేందుకు ప్రాముఖ్యతనిస్తున్నారు. దీంతో రైతులు రాగుల సాగు వైపు మొగ్గు చూపుతున్నారు.

సస్యరక్షణ చర్యలు

- రాగి పంటకు కాండం తొలిచే పురుగు ఎక్కువగా ఆశిస్తుంది. ఆకుమచ్చ, అగ్గి తెగులు నుంచి ప్రమాదం ఉంది.
- ఎస్పేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మిల్లీ లీటర్లు లీటరు నీటిలో పిచికారీ చేసి చేనుపై చల్లితే కాండం తొలిచే పురుగు నుంచి ఉపశమనం ఉంటుంది.
- రసాయనిక పురుగుమందుల కంటే సేంద్రియ ఎరువులు/జీవరసాయనాలు వాడటం మంచిది. – ఏ దశలోనైనా వేప నూనె పంటకు వేస్తే మంచి ఫలితం వస్తుంది.

పోషక విలువలు భేష్

'రాగి జావ/అంబలి రోజూ ఉదయం పూట తాగితే జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. శరీరానికి చల్లదనం వస్తుంది. శారీరక దృఢత్వం కలుగుతుంది. రక్త వృద్ధి, ప్రసరణ చురుగ్గా ఉంటుంద'ని వైద్యులు చెప్తున్నారు. ప్రస్తుతం చాలా మందికి రోజువారీ ఆహారంలో రాగులతో చేసిన పదార్థాలు భాగమైపోయాయి. వీటిలో విటమిన్లు, మినరల్స్, ఫైబర్, వివిధ రకాల యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువ. విటమిన్ బీ–17 క్యాన్సర్ వంటి వ్యాధులను నిరోధిస్తుంది. కాల్షియం ఎముకలకు బలాన్నిస్తుంది. పీచు పదార్థాలు అధిక మోతాదులో ఉండటంతో ఊబకాయం తగ్గుతుంది.

తినేందుకు లేకుండా కొనుక్కెళ్లిపోతున్నారు



ఒకప్పుడు చోడి(రాగులు) పంట వేస్తే అమ్ముడు పోక మేమే వాడుకునే వాళ్లం. ఇప్పుడు మా ఇంట్లో అవసరాలకు కూడా లేకుండా చోడి గింజలు కొనుక్కుని వెళ్లిపోతున్నారు. ఈ పంటకు పెద్దగా నీరు తడి అవసరం లేదు. నీటి ఎద్దడి ఉన్నా పంట చేతికొచ్చేస్తుంది. ఈ ఏడాది కూడా పంట వేశాను. చేను బాగా ఎదిగింది. దిగుబడి కూడా బాగానే వస్తుందన్న నమ్మకం ఉంది. ప్రస్తుతం ధరలు బాగుండటంతో మంచి ఆదాయమే వస్తుంది.

– నంబారు సన్యాసిరావు, రాయపురఅగ్రహారం

ఆసక్తి కనబరుస్తున్నారు



గతంలో రాగుల సాగుపై రైతులు అంతగా ఆసక్తి చూపేవారు కాదు. రెండు మూడేళ్లుగా పరిస్థితి మారింది. మేం కూడా రాగుల సాగు ప్రయోజనాలు, ఆర్జించే లాభాలను వివరించి, రైతులను చైతన్య పరుస్తున్నాం. ముఖ్యంగా చిరుధాన్యాల పంటలో అధిక లాభాలను తెచ్చే రాగులపై ఎక్కువగా దృష్టి సారించాం. ప్రభుత్వం చిరు ధాన్యాల సాగును ప్రోత్సహిస్తోంది. రానున్న కాలంలో సాగు విస్తీర్ణం రెట్టింపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం.

– టి.దుర్గాప్రసాద్, వ్యవసాయాధికారి, పెందుర్తి

నేత్రదానంపై అపోహలొద్దు



సబ్బవరం పీహెచ్‌సీలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వైద్య సిబ్బంది

సబ్బవరం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో నేత్రదాన పక్షోత్సవాలను ఈ నెల 25 నుంచి వచ్చే నెల 8 వరకు నిర్వహించనున్నట్లు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆశ తెలిపారు. కార్యక్రమంలో భాగంగా బుధవారం పీహెచ్‌సీలో నేత్రదానం ఆవశ్యకత, నేత్రదానం చేయడంలో కుటుంబ సభ్యుల అపోహల్ని తొలగించడంపై సిబ్బందికి, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పక్షోత్సవాల్లో భాగంగా ప్రతి ఇంటినీ సందర్శించి, కుటుంబ సభ్యులకు నేత్రదానంపై చైతన్యం కల్పించాలని సిబ్బందికి సూచించారు. మరణించే వ్యక్తి నేత్రాలు దానం చేయడం ద్వారా, రెండోసారి ఈ ప్రపంచాన్ని చూసే అవకాశం ఆ వ్యక్తికి కల్పిస్తున్నామన్న విషయంతో పాటు, చూపు నోచుకోని వారికి దృష్టిని ప్రసాదిస్తున్న గొప్ప కార్యంగా ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌వో స్వర్ణలత, హెచ్ఈవో జేసుదాసు, అప్తాలమిక్ అధికారి ఎ.రాజీవ్ లోచన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా అన్నసమారాధన



గుర్రంపాలెంలో వడ్డన చేస్తున్న యాదవ సంఘం ప్రతినిధులు

పెందుర్తి: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా గుర్రంపాలెంలోని శ్రీకృష్ణ దేవాలయంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. మండల యాదవ సంఘం ఆధ్వర్యంలో విశేష పూజలు జరిపారు. మధ్యాహ్నం దాదాపు 2 వేల మందికి అన్నసమారాధన చేశారు. సంఘం అధ్యక్షుడు చందక చలపతిరావు, ప్రధాన కార్యదర్శి కాయిత ఎర్రిబాబు, ఉరికిటి లక్కీ గోవింద్, గ్రామ సంఘం నాయకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దోమలు వృద్ధి చెందకుండా చైతన్య కార్యక్రమాలు

జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



డ్రోన్లతో దోమల మందు పిచికారీపై సిబ్బందికి సూచనలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్

అగనంపూడి: వ్యర్థాలతో అనర్థాలకు అవకాశం ఉందని, బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలు డంపింగ్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్ కుమార్ ఆదేశించారు. 79వ వార్డులోని గళ్లవానిపాలెంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వార్డు పరిధిలో అధికంగా వ్యర్థాలు కనపడుతున్నాయని అసంతృప్తి వ్యక్తం చేశారు. తడి, పొడి చెత్తను విభజించి క్లాప్ వాహనాల ద్వారా డంపింగ్ యార్డులకు వెంటనే తరలించాలని ఆదేశించారు. దోమల నివారణకు ఎంఎల్ తైలాన్ని పిచికారీ చేయాలని సూచించారు. నీటి నిల్వలు ఉండడంతో దోమలు వ్యాప్తి చెందుతాయని, వాటి వల్ల డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా వంటి విషజ్వరాలు వ్యాప్తి చెందుతాయన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బి.సన్యాసినాయుడు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాసరావు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు షురూ



నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బిగించిన స్మార్ట్ మీటర్

సీతమ్మధార: విద్యుత్ వినియోగదారుల కనెక్షన్లకు సంబంధించి స్మార్ట్ మీటర్లు అందుబాటులోకి వచ్చాయి. అదానీ కంపెనీ ప్రతినిధులు ముందుగా ప్రభుత్వ సర్వీసులకు సంబంధించి స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. ఇందులో భాగంగా సింగిల్ ఫేజ్‌కు బిగించే మీటర్లు రూ.8 వేలు, ట్రిబుల్ ఫేజ్‌కు రూ.10 వేల చొప్పున చెల్లించాలని అధికారులు తెలిపారు. విశాఖలో పైలట్ ప్రాజెక్టులో భాగంగా ఆశీలమెట్ట, విశాలాక్షినగర్ ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం 'సాక్షి'తో సీతమ్మధార సెక్షన్ ఈపీడీసీఎల్ అసిస్టెంట్ ఇంజినీర్ సుధాకర్ మాట్లాడుతూ తమ సబ్ డివిజన్ సెక్షన్ పరిధిలోని సీతమ్మధార, మద్దిలపాలెం, హెచ్‌బీ కాలనీ ప్రాంతాల్లో ఇప్పటివరకు 200 వరకు స్మార్ట్ మీటర్లు బిగించామని తెలిపారు. వినియోగదారులు ప్రీపెయిడ్ విధానంలో మొబైల్‌ఫోన్లు మాదిరిగానే రీచార్జి చేసుకోవాల్సి ఉంటుందన్నారు. లేనిపక్షంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని స్పష్టం చేశారు. 24వ వార్డు నక్కవానిపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం అదానీ కంపెనీ సిబ్బంది స్మార్ట్ మీటర్ బిగించారు. తర్వాతి దశలో కమర్షియల్ కనెక్షన్లకు కూడా స్మార్ట్ మీటర్లు బిగిస్తారు.

ఆకాశవాణిలో నేత్రదానంపై అవగాహన



నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్న కంటి వైద్య నిపుణురాలు ప్రీతి

ఆరిలోవ: అంధత్వ నివారణ సంస్థ, ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో బుధవారం ఆల్ ఇండియా రేడియో(ఆకాశవాణి)లో 39వ జాతీయ నేత్రదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేత్ర వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ మీనాక్షి ఆధ్వర్యంలో కార్నియా కన్సల్టెంట్ డాక్టర్ మోహన్ ప్రీతి ఆకాశవాణి కేంద్రంలో మాట్లాడారు. ఏవిధంగా నేత్ర దానం చేయాలి, ఎవరికి చేయాలి, నేత్రదానం ఎవరు చేయవచ్చు తదితర విషయాల గురించి ఆకాశవాణితో ద్వారా శ్రోతలకు చేరవేశారు. ఈ సందర్భంగా ఆకాశవాణి ప్రతినిధి దిలీప్ నేత్రదానంపై ప్రజల నుంచి వచ్చే సందేహాలను డాక్టర్ ప్రీతి ద్వారా తెలుసుకుని వెల్లడించారు. ఇది రేడియోలో శుక్రవారం ఉదయం 7.15 గంటలకు ఆరోగ్యమే మహా భాగ్యం కార్యక్రమంలో ప్రసారం చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమాన్ని శ్రోతులు విని అవగాహన పెంచుకోవాలని సూచించారు.

విద్యార్థుల నడవడికను గమనించాలి



స్టీల్‌ప్లాంట్ జీఎం రామ్‌ప్రసాద్‌ను సత్కరిస్తున్న సీఐ, కళాశాల ప్రిన్సిపాల్

అగనంపూడి: విద్యార్థుల నడవడికతో పాటు ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తుండాలని దువ్వాడ ఇన్‌స్పెక్టర్ వావిలపల్లి ఎర్రంనాయుడు అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రోడ్డు భద్రత, మాదక ద్రవ్యాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థి దశ కీలకమైందని, ఈ దశలో వేసే ప్రతీ అడుగు జీవిత గమ్యాన్ని నిర్దేశిస్తుందన్నారు.మైనర్లు వాహనాలు నడపకూడదని సూచించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయికి బానిసలుగా మారిన యువత దారి తప్పి విలువైన జీవితాన్ని కోల్పోతున్నారని చెప్పారు. మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా ఈనెల 31న పదవీ విరమణ పొందనున్న స్టీల్ ప్లాంట్ జీఎం రామప్రసాద్‌ను సీఐ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ జి.సుధాకర్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, హ్యూమన్ రైట్స్ అవేర్నెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మోటూరి వెంకటరమణ, ఆశాలత, జి.వరప్రసాద్ పాల్గొన్నారు.

ప్రజా రవాణా ఉద్యోగుల టీఏ పునరుద్ధరించాలి



జాయింట్ డైరెక్టర్ శ్రీనివాస్ నాయక్‌కు వినతి పత్రం అందిస్తున్న ఎన్ఎంయూఏ నాయకులు

మద్దిలపాలెం: ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు ఈ నెల నుంచి నిలిపివేసిన టీఏ అలవెన్స్‌ను పునరుద్ధరించి, ఎరియర్స్, ఇతర అలవెన్స్‌లు సకాలంలో చెల్లించాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్ఎంయూఏ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసరాజు కోరారు. ఈ మేరకు బుధవారం విజయవాడలో డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీస్‌లో జాయింట్ డైరెక్టర్ పూజారి శ్రీనివాస్ నాయక్‌కు వినతి పత్రం అందించామని తెలిపారు. ఏపీపీటీడీ ఉద్యోగులకు ఇవ్వాల్సిన అలవెన్స్‌లను అకస్మాత్తుగా నిలిపివేయడంతో తీవ్ర అసంతృప్తికి గురయ్యామని ఆయన పేర్కొన్నారు. రాత్రనకా, పగలనకా 8 నుంచి 16 గంటల పాటు ప్రయాణికులకు సేవలందిస్తున్న ప్రజా రవాణా శాఖ ఉద్యోగులకు అలవెన్స్‌లు కొరత పెట్టి ఇబ్బందులకు గురిచేయడం భావ్యంగా లేదన్నారు. కార్యక్రమంలో విజయనగరం జోన్ అధ్యక్ష కార్యదర్శులు ప్రదీప్‌కుమార్, ఎం.వి.ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హైవేపై ట్రాఫిక్ జామ్



హైవేపై క్రేన్‌తో పనులు చేస్తున్న దృశ్యం

విశాఖ విద్య: ఎన్ఏడీ సమీపంలోని జాతీయ రహదారిపై బుధవారం ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఎన్ఏడీ ఫ్లై ఓవర్‌కు ఆనుకొని ఆర్‌వోబీ పనులు జరుగుతున్నాయి. అయితే బ్రిడ్జి పిల్లర్లు వేసే క్రమంలో క్రేన్ రోడ్డుకు అడ్డంగా నిలుపడంతో ట్రాఫిక్‌కు జామ్ అయింది. జాతీయ రహదారిపై ఉదయం, సాయంత్రం వేళల్లో ఎక్కువగా వాహనాల రద్దీ ఉంటుంది. ఇలాంటి సమయంలో క్రేన్‌ను రోడ్డుపై నిలిపి పనులు చేయడంపై వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఇదే చోట తరచూ ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఏదైనా జరగరాని సంఘటన జరిగిన తర్వాత హడావుడి చేసేకంటే ట్రాఫిక్ పోలీసులు ఇలాంటి వాటిపై దృష్టి సారించి వాహనదారులు కోరుతున్నారు.

ఉత్తర ప్రత్యుత్తరాలతోనే తెలుగుకు గుర్తింపు



తెలుగు భాషకు ప్రాధాన్యం పెంచాలని ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

అగనంపూడి: తెలుగు భాష గొప్పదనం, ఔన్నత్యం పెరగాలంటే జాతీయ స్థాయిలో తెలుగు భాషలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామఅప్పారావు అన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా అగనంపూడిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో తెలుగు భాషకు కనీస ప్రాధాన్యమివ్వడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. తెలుగు భాషలో స.హ.చ లేఖలు రాస్తే తిప్పి పంపుతున్నారని, తెలుగు భాషకు కూడా కేంద్ర ప్రభుత్వ శాఖలతోపాటు ప్రధాని, రాష్ట్రపతి కార్యాలయాల్లో ప్రాధాన్యం పెంచేలా చూడాలన్నారు. అప్పుడే తెలుగు భాషకు జాతీయ స్థాయిలో గుర్తింపు ఉందని భావించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో రచయిత కట్టా పైడిరాజు, వాకింగ్ క్లబ్ అధ్యక్షుడు మడగల నరసింగరావు, రైల్వే సలహా మండలి డైరెక్టర్ కొలిపాక అప్పారావు, ఉక్కు కార్మిక సంఘం నాయకుడు శీరంశెట్టి గోవిందరావు పాల్గొన్నారు.

బీజేపీ ప్రభుత్వం ఉక్కును ఆదుకుంటుంది

అగనంపూడి: విశాఖ ఉక్కును ఆదుకోడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని బీజేపీ గాజువాక కన్వీనర్ కె.నరసింగరావు అన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1294వ రోజు దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వం రూ.1500 కోట్ల మేరకు నిధులు విడుదల చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. టీఎన్‌టీయూసీ నాయకులు విళ్లా రామ్మోహన్ కుమార్, జనసేన నాయకుడు గంధం వెంకటరావు , గూడూరు శంకరరావు, ఈగలపాటి యువశ్రీ, పంచదార్ల ఉగ్రం, బొత్స దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో పందిరి రాటమహోత్సవం



పందిరి రాట మహోత్సవంలో పాల్గొన్న విజయ్ తదితరులు

విశాఖ విద్య: జీవీఎంసీ 52వ వార్డ్ శాంతినగర్‌లో స్థానిక శాంతినగర్ యూత్ ఆధ్వర్యంలో బుధవారం వరసిద్ధి వినాయకుడి ఉత్సవాలకు పందిరి రాట మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది 15 అడుగుల గణపయ్యను ఏర్పాటు చేసి సుమారుగా 21 రోజులు పాటు పూజలు నిర్వహిస్తామని శాంతినగర్ యువజన విభాగం అధ్యక్షుడు జియ్యాని విజయ్ కుమార్ చెప్పారు. పందిరిరాట మహోత్సవం పురస్కరించుకొని అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు ,యూత్ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.